క్లుప్తంగా

కొమరగిరిపట్నంలో వైద్య శిబిరం



నిర్వాహకులను సత్కరిస్తున్న గ్రామస్తులు

అల్లవరం: కొమరగిరిపట్నంలో స్కంద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక హైస్కూల్లో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొప్పినీడి శ్రీహరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. శిబిరం ఏర్పాటుకు కృషి చేసిన నిర్వాహకుడు రాజా, డాక్టర్ శ్రీహరిని గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

లక్ష్మణేశ్వరుడికి బిల్వార్చన



పార్వతీ సమేత లక్ష్మణేశ్వర స్వామి

అల్లవరం: కార్తికమాసాన్ని పురస్కరించుకుని లక్ష్మణేశ్వరంలో కొలువైన పార్వతీ సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చనను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దొంతికుర్తి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిల్వ పత్రాలతో స్వామివారిని అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

అయ్యప్ప భక్తులకు అన్న సమారాధన



యానాంలోని శ్రీ దత్త మణికంఠ పూజా మందిరం

యానాం: స్థానిక శ్రీ దత్త మణికంఠ పూజా మందిరంలో భవానీలు, శివభక్తులు, అయ్యప్ప భక్తులకు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత స్వామి వారికి పూజలు నిర్వహించారు.

వడ్డిగూడెంలో స్థల వివాదం

అమలాపురం టౌన్: అమలాపురం వడ్డిగూడెంలో ఓ స్థలానికి సంబంధించి రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీనిపై రెండు వర్గాలు వాదోపవాదాలు వినిపించుకుంటున్నాయి. రోడ్డు మార్గంలో షెడ్డు నిర్మించుకున్న ఓ వ్యక్తిపై అదే రోడ్డులో నివాసం ఉంటున్న కొందరు ఆ షెడ్డుపై అభ్యంతరాన్ని లేవనెత్తారు. దీంతో స్థల యాజమాని పట్టణ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు స్థల పరిశీలన చేశారు. రోడ్డుపై ఎలా షెడ్డు నిర్మిస్తారని, దానికెలా రిజిస్ట్రేషన్ చేశారని అక్కడి నివాసితులు కొందరు వాదిస్తుంటే స్థల యజమాని మాత్రం తన వద్ద స్థలానికి సంబంధించి అన్ని లిఖిత పూర్వక ఆధారాలు ఉన్నాయంటున్నారు. స్థలం సొంతం కాకపోతే తనకు విద్యుత్ మీటరు, రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇది ముమ్మాటికీ రోడ్డేనని అక్కడి స్థానిక నివాసితులు ఆరోపిస్తున్నారు. స్థల యాజయాని వర్గం నుంచి ఓ టీడీపీ నాయకుడు తమపై దౌర్జన్యం చేశారని స్థానిక నివాసితుల్లో కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పి.మల్లవరంలో రక్తదాన శిబిరం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ధూళిపూడి వెంకట రమణ తన పుట్టినరోజు సందర్భంగా 82వ పర్యాయం రక్తదానం చేశారు. ఆదివారం పి.మల్లవరంలో వెంకటరమణ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ రోటరీ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వెంకటరమణ పాల్గొని 82వ సారి రక్తదానం చేశారు. ఆయనతో పాటు ఆయన అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అభినందించారు.

కనకదుర్గమ్మకు పల్లకీ బహూకరణ



దాత బహూకరించిన పల్లకీ

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి గ్రామంలో వేంచేసి యున్న కనకదుర్గమ్మ వారి ఆలయానికి అమలాపురం రూరల్ మండలం రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జలధాని కాశీ విశ్వేశ్వరరావు పల్లకీని బహూకరించారు. అమ్మవారి గ్రామోత్సవం నిర్వహణ కోసం పల్లకీని తయారు చేయించి ఆలయానికి ఆదివారం అందించారు.

సమస్యల వనాలు..!

- ఉద్యాన వనాల అభివృద్ధిపై ఉదాసీనత
- అసౌకర్యాలతో తగ్గుతున్న సందర్శకుల తాకిడి
- తుప్పు పట్టిన ఆట పరికరాలతో చిన్నారులకు గాయాలు
- అభివృద్ధి చేయాలని స్థానికుల విన్నపాలు



చంద్రబాబు ఉద్యానవనంలో తుప్పుపట్టి ప్రమాదకరంగా మారిన ఆట పరికరాలు



విరిగిన బొమ్మల నడుమ సందర్శకులతో చంద్రబాబు ఉద్యానవనం

అమలాపురం టౌన్: సాయం సంధ్య వేళ ఆహ్లాదం కోసం సరదాగా సేద తీరే ఉద్యాన వనాలు (పార్కులు) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అమలాపురం మున్సిపాలిటీలో ఉన్న ఆరు ఉద్యాన వనాల్లో తామరు చెరువు డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు పార్కు మాత్రమే సందర్శకులకు సంతృప్తినిస్తోంది. ఈ పార్కులో మాత్రమే ఆహ్లాదాన్ని ఆస్వాదించే స్థాయిలో అభివృద్ధి జరిగింది. మిగిలిన పార్కుల్లో మాత్రం ఎక్కడి గొంగలి అక్కడే అన్న చందంగా అభివృద్ధి పడకేసింది. ముఖ్యంగా స్థానిక మున్సిపల్ వాటర్ వర్క్స్ వద్ద గల చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం, ఎన్టీఆర్ మార్గ్‌లో గల కాటన్ పార్కులు మరీ అధ్వానంగా తయారయ్యాయి. చంద్రబాబు ఉద్యానవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సందర్శకులు అసౌకర్యానికి గురవుతున్నారు. కాటన్ పార్కును మున్సిపాలిటీ పూర్తిగా పట్టించుకోవడమే మానేసింది. దాదాపు కిలోమీటరు మేర అటు పంట కాలువ, ఇటు రోడ్డు చెంత విస్తరించి ఉన్న కాటన్ పార్కులో అసలు అది పార్కు అనే ఆనవాళ్లే కనిపించని స్థాయిలో అసౌకార్యాలు తిష్ట వేశాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోయి పార్కులో ఉన్న విగ్రహాలు శిథిలమై అధ్వానంగా మారిపోయింది. ఇక మున్సిపల్ పిల్లల పార్కు సౌకర్యాల పరంగా కొంత నయం. ఆ పార్కులోనూ కొన్ని సమస్యలు, అసౌకర్యాలు నెలకొన్నాయి. ఇక సావరంలో ఉన్న పార్కు, సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానానికి సమీపంలో గల కొండిన్యనగర్ పార్కుల అభివృద్ధి ఊసే లేదు.

పట్టించుకునే నాథుడే లేడు

చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనానికి ఏడేళ్ల నుంచి సందర్శకుల తాకిడి బాగా పెరిగింది. ఒకప్పుడు ఎంతో అభివృద్ధి జరిగిన ఈ ఉద్యానవనం ఇప్పుడు నిధుల లేమితో నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇందులో పిల్లలు ఆడుకునే ఇనుప ఆట పరికరాలు తుప్పు పట్టాయి. పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన రకరకాల బొమ్మలు విరిగిపోయి ఆహ్లాదం కంటే అసౌకర్యాలనే అందిస్తున్నాయి. ఎందరో వాకర్లు ఈ ఉద్యానవనంలో ఉన్న వాకింగ్ ట్రాక్‌పై నడిచే వారు. ఇప్పుడు అసౌకర్యాలతో వారి సంఖ్య కూడా తగ్గింది. ఉద్యానవనంలో తుప్పు పట్టిన ఆట పరికరాలపై పిల్లలు ఆడుతున్న సమయంలో ఓ పిల్లాడి చేతికి గాయమైంది. ఇలా తరుచూ పలువురు పిల్లలు గాయాలపాలవుతుండడంతో సందర్శకుల రాక గతం కంటే కొంత తగ్గింది. ఈ ఉద్యానవనం ఉన్న 27వ వార్డు కౌన్సిలర్ బంగారు గోవిందు ఉద్యానవనంలో సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు మున్సిపల్ అధికారులకు మొర పెట్టుకుంటూనే ఉన్నారు. గతంలో ఈ ఉద్యానవనం 26వ వార్డులో ఉన్నప్పుడు ఆ వార్డు కౌన్సిలర్ యండమూరి గంగ రూ.4 లక్షలతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచే ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఉద్యానవన అభివృద్ధిని మున్సిపాలిటీ పట్టించుకోలేదని కౌన్సిలర్లు గోవిందు, గంగ ఆరోపిస్తున్నారు.

పట్టణంలో ఉద్యానవనాల పరంగా తామర చెరువు పార్కు అభివృద్ధిలో ముందంజలో ఉంది. ఈ పార్కును మాత్రమే అభివృద్ధి చేస్తూ మిగిలిన పార్కులను పట్టించుకోని వైనాన్ని మున్సిపాలిటీ పక్ష పాత ధోరణిగా పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ పార్కులో సకల సౌకర్యాలు కల్పిస్తూ మిగిలిన పార్కుల్లో నెలకొన్న సమస్యలను ఎందుకు పరిష్కరించటం లేదని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ పార్కుతో పాటు మిగిలిన పార్కులను ముఖ్యంగా చంద్రబాబు ఉద్యానవనాన్ని పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరలోనే అభివృద్ధి చేస్తాం

పట్టణంలోని పార్కుల అభివృద్ధికి సంబంధించి ఓ ప్రత్యేక ప్రణాళికతో త్వరలోనే పనులు చేపడతాం. చంద్రబాబు ఉద్యానవనంలో సమస్యల పరిష్కారానికి రూ.10 లక్షల వరకు నిధులు అవసరం. కొన్ని నెలల్లో ఆ నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తాం. మిగిలిన పార్కుల్లో నెలకొన్న అసౌకర్యాలు, సమస్యలను సైతం దశల వారీగా పరిష్కరిస్తాం.

– కేవీఆర్ఆర్ రాజు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ.

విద్యుత్ చార్జీల పెంపు దారుణం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని



పితాని బాలకృష్ణ

ముమ్మిడివరం: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు సామాన్యులకు మరింత భారం కానుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ విమర్శించారు. రాబోయే ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల వేళ సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి అధికారం చేపట్టాక తుంగలో తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన ముమ్మిడివరంలో ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండు సార్లు చార్జీలు పెంచి ప్రజలపై రూ.15,585 కోట్ల మేర భారం మోపి నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో ఎటువంటి విద్యుత్ చార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పేదలకు ఉచితంగా, రాయితీలపై విద్యుత్ ఇవ్వడం జరిగిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచే ప్రయత్నాన్ని తక్షణమే విరమించుకోవాలని పితాని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాల హామీలు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రతి పక్ష పార్టీ నాయకులపై కక్ష పూరిత ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరం

అల్లవరం: ఓడలరేవులో మధుర కేఫ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం డెల్టా ఆస్పత్రి, మామిడికుదురు అంజి కంటి ఆస్పత్రి, అమలాపురం క్యాపిటల్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు కంటి పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాడి ఉమా మహేశ్వరరావు, మధుర కుమారస్వామి, డాక్టర్ విజయ్‌కుమార్, మధుర ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూర్తి సేవలు మరువలేనివి



మున్సిపల్ మేనేజర్ మూర్తి దంపతులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ రాజు తదితరులు

అమలాపురం టౌన్: మూడున్నర దశాబ్దాలుగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలు మున్సిపాలిటీల్లో మేనేజర్‌గా పనిచేసిన మాచిరాజు వెంకట సూర్యనారాయణమూర్తి సేవలు అభినందనీయమని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు అన్నారు. అమలాపురం మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన మూర్తికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన వీడ్కోలు సభలో చైర్‌పర్సన్, కమిషనర్‌లు మాట్లాడారు. సభకు హాజరైన వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, కట్టోజు సన్యాదాసులు మేనేజర్ మూర్తి సేవలను కొనియాడారు. అనంతరం మేనేజర్ మూర్తి దంపతులను మున్సిపాలిటీ తరుపున చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారిణి భూపతి శ్రీలక్ష్మి, ఏఈ వెంకటేష్, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు జాన్ బెల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ, మున్సిపల్ ఇంజినీర్లు, పారిశుద్ధ్య, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొని మూర్తి దంపతులకు వీడ్కోలు పలికారు.

ఎయిడ్స్ మహమ్మారిని పారద్రోలుదాం



గాడిమొగ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

తాళ్లరేవు: హెచ్ఐవీ బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన కోరారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నందివర్ధన మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారికి గల హక్కులు, చట్టాల గురించి వివరించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాడిమొగ సీహెచ్‌సీ వైద్యురాలు జయభార్గవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. 'నా ఆరోగ్యం– నా హక్కు' నినాదంతో ఎయిడ్స్ ర్యాలీని ప్రారంభించారు. గాడిమొగ గ్రామ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ బొడ్డు కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ రంజన్, హెల్త్ అసిస్టెంట్‌లు ఎం.రమేష్, కేఎస్ ప్రసాద్, ఆదినారాయణ, త్రిమూర్తులు, గోవిందు, ఆంజనేయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ నేత రాము మృతికి నివాళి

అమలాపురం టౌన్: రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘం అధ్యక్షుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గల్లా రాము మృతి కార్మిక లోకానికి తీరని లోటని పలు కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. అమలాపురంలోని దివంగత రాము ఇంటికి కార్మిక సంఘాల నాయకులు వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శించి సంతాపం తెలిపారు. అక్కడే సంతాప సభ నిర్వహించారు. కార్మికుల హక్కుల కోసం రాము చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. అమలాపురం తాలూకా తాపీమేస్త్రీ పనివార్ల సంక్షేమ సంఘం, జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం వేర్వేరుగా ఆదివారం సంతాప సభలు నిర్వహించి రాము సేవలను కొనియాడాయి. తాపీమేస్త్రీ పనివార్ల సంఘం అధ్యక్షుడు కోటిపల్లి రాంబాబు, జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ప్రసంగించారు.

కన్నుల పండువగా వీరేశ్వరుని దీపోత్సవం



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవ కాంతులు



భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కన్నుల పండువగా దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో భారీ సెట్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పరమశివుడు, ఓంకారం, మంచు కొండల ఆకృతులతో చేపట్టిన దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకొంది. దీపాలు వెలిగించేందుకు అధిక సంఖ్యలో భక్తులు మండలం నలుమూలల నుంచి తరలి వచ్చారు. ఆలయ పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పార్థివ లింగానికి అభిషేకం, గణపతి పూజ నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదం, తాగునీటి ఏర్పాట్లను ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. ఆలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పూలు, బిల్వాలతో అలంకరించారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం



కూనవరంలో వర్షాలకు నేలకొరిగిన వరిచేను



అమలాపురం పట్టణంలోని సావరంలో రహదారిపై నిలిచిన వర్షపునీరు



మునిపల్లిలో కాలువను తలపిస్తున్న ప్రధాన రహదారి

ఉప్పలగుప్తం: ఫెంగల్ తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో కూనవరం, కిత్తనచెరువు, సరిపల్లి, గోపవరం, విలసవిల్లి, భీమనపల్లి గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. చేతికి వచ్చిన పంట చేలలోనే నీరు కారటంతో రైతన్నలు కన్నీరు మున్నీరవుతున్నారు. సాగుకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని పంట చేతికొచ్చే సమయంలో ఈ వర్షం నిండా ముంచిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రహదారులు జలమయం

అమలాపురం టౌన్: అల్ప పీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు అమలాపురం పట్టణంలో ఆదివారం దాదాపు జన జీవనం స్తంభించింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతమైన సావరంలో రోడ్లపైకి ముంపు నీరు చేరుకుంది. ఆర్టీసీ బస్ స్టేషన్‌లోనే కాక స్టేషన్‌కు ఎదురుగా గల ఈదరపల్లి రోడ్డులో పలు చోట్ల వర్షం నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. పట్టణంలో వర్షాల కారణంగా కొన్ని దుకాణాలే తెరుచుకున్నాయి. ఆదివారం సెలవు కావడంతో విద్యా సంస్థలు పనిచేయక పోవడంతో విద్యార్థులు సురక్షితంగా ఇళ్ల వద్ద ఉండగలిగారు. శనివారం ఉదయం మొదలైన వర్షం ఆదివారం రాత్రి వరకూ కురుస్తుండటంతో పట్టణ ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడ్డారు.

ఎడతెరపి లేని వర్షం

ఉప్పలగుప్తం: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మండలంలో ఆయా గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లో ప్రధాన రహదారులు, గ్రామాల లింకు రోడ్లు కొన్ని చోట్ల జలమయమవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వినియోగదారుల తాకిడిలేక వ్యాపార సంస్థలు వెలవెలబోయాయి. ప్రజలు బయటకు రావటానికి వీలు లేక ఇళ్లకే పరిమితమయ్యారు.



గొల్లవిల్లిలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం

కామనగరువులో వరుస చోరీలు

వాహనాల్లో బ్యాటరీలు అపహరిస్తున్న దొంగలు

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు గ్రామ పరిధిలో వారం రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. వాహనాల్లోని బ్యాటరీలను టార్గెట్ చేసుకుని వాటిని అపహరించుకుపోతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చోరీలు జరుగుతున్న తీరును బట్టి తెలుస్తోంది. వీరి ఆదినారాయణ ట్రాక్టర్‌లోని బ్యాటరీలను దొంగలు దొంగిలించుకుపోయారు. రాజులపూడి భాస్కరరావు ట్రాక్టర్‌లోని బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ములపర్తి శ్రీను చెరువులకు సంబంధించిన జనరేటర్‌లోని బ్యాటరీలను పట్టుకుపోయారు. చల్లపల్లి రోడ్డులో మెకానిక్ షాపులోని కారులో ఉన్న బ్యాటరీలను సైతం ఎత్తుకెళ్లారు. పరంజ్యోతి పాఠశాల సమీపంలో ఆగి ఉన్న లారీలోని బ్యాటరీలు పట్టుకుపోయారు. ఇలా దొంగలు పెట్రేగిపోతూ చోరీలకు పాల్పడుతున్నారు. రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్ సక్రమంగా లేకపోవడం వల్లే అర్ధరాత్రి సమయాలు దొంగలకు అనువుగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు దొంగతనాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు. బాధితులు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహాదేవుడికి కార్తిక పూజలు



ఉప్పలగుప్తం: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో మహాదేవుడికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునిపల్లిలో పార్వతీ మల్లేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు కొమ్మాళ్లపల్లి కాశీ విశ్వనాథ శర్మ స్వామి వారికి రుద్రాభిషేకాలు చేసి పుష్పాలతో అలంకరించారు. గ్రామస్తులు అర్చకులను పూల మాలలతో సత్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వర్తక సంఘీయుల వన సమారాధన



వర్తక సంఘం అధ్యక్షుడు వాసును సత్కరిస్తున్న సంఘీయులు

తాళ్లరేవు: కార్తికమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా సుంకరపాలెం శ్రీలక్ష్మీ గణపతి వరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. స్థానిక బైపాస్ రహదారిలోని కాపు కల్యాణ మండపంలో వర్తక సంఘం నూతన అధ్యక్షుడు పుగాకు వాసు పర్యవేక్షణలో వర్తక సోదరులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మ్యూజికల్ చైర్స్, హౌసీ తదితర ఆటలు ఆడారు. వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పుగాకు వాసును సంఘ ప్రతినిధులు సత్కరించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వర్తక సంఘం ప్రతినిధులు, పరిసర ప్రాంతాలకు చెందిన వర్తకులు పాల్గొన్నారు.

స్పెషల్ ప్రొటెక్షన్ ఎస్సై రాజేష్‌కు పదోన్నతి



రాజేష్‌ను సత్కరిస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్పీఎఫ్) అమలాపురం ఓఎన్జీసీ ఎస్సైగా పని చేస్తున్న రాజేష్ సీఐగా పదోన్నతి పొందారు. పదోన్నతి తర్వాత సీఐ రాజేష్ శ్రీశైలం దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కొంకాపల్లి సత్తెమ్మతల్లి గుడి వద్ద సీఐ రాజేష్‌కు ఆదివారం అభినందన సభ జరిగింది. ఈ సభకు రాజమహేంద్రవరం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ గంగరాజు, సీఐ నక్కా సత్యనారాయణ, అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు అతిథులుగా పాల్గొని సీఐ రాజేష్ సేవలను కొనియాడారు. అనంతరం ఘనంగా సత్కరించారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అమలాపురం రూరల్: రెడ్డిపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ కేవీఆర్ రీసెర్చ్ ఫౌండేషన్, శ్రీ సత్యసాయి సేవా సమితి, సమదృష్టి క్షమతా వికాసం, అనుసంధాన్ మండలి జాతీయ సంస్థ సౌజన్యంతో శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. వైద్యులు శ్రీమన్నారాయణ, నరసింహరాజు, అనంతలక్ష్మి, అభిషేక్ వర్మలు 450 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సేవలు అందించిన వైద్య బృందానికి సర్పంచ్ రత్న ప్రసన్న ప్రవీణ్, కార్యదర్శి ఆదిశంకరం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి, కరాటం సూర్య భాస్కరరావు, కొలిశెట్టి జయ ప్రకాష్, నిమ్మకాయల రాంబాబు, కళాశాల కరస్పాండెంట్ నరసింహారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రహోమం

యానాం: స్థానిక శివాలయంలో పవిత్ర కార్తికమాసం చివరిరోజు సందర్భంగా రుద్రహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆత్రేయ గోదావరి నదీ తీరాన కొలువైన రాజరాజేశ్వర స్వామికి ఆదివారం ఆలయ అర్చకులు శివ నేతృత్వంలో రుద్రాభిషేకం, రుద్రహోమం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన చేపట్టారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.